సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నజర్

- ప్రత్యేక పోలీస్, సీసీ కెమెరాలతో నిఘా
- సబ్ డివిజన్‌లో స్ట్రైకింగ్ ఫోర్స్
- సరిహద్దులో భద్రత కట్టుదిట్టం
- 'నమస్తే తెలంగాణ'తో భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

జయశంకర్ భూపాలపల్లి, మే 11 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. క్రిటికల్ కేంద్రాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తో నిఘా పెట్టారు. సబ్ డివిజన్‌లో స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా, రాష్ట్ర సరిహద్దులో భద్రతా కట్టుదిట్టం చేసి, ఎన్నికలకు మూడు కేంద్ర కంపెనీల బలగాలను దింపారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్‌ఖరే ఎన్నికల ఏర్పాట్లపై 'నమస్తే తెలంగాణ'కు వివరించారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక నిఘా

క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక నిఘా పెట్టాం. జిల్లాలో 447 పోలింగ్ కేంద్రాలు ఉండగా 88 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు ఎస్పీ తెలిపారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక సీఐతో పాటు ప్రత్యేక పోలీసులు, సబ్ డివిజన్ పరిధిలో ఒక డీఎస్పీ ర్యాంక్ అధికారితో స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. 44 లొకాలిటీల్లో సీఆర్‌పీఎఫ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్నికలకు ప్రత్యేక బలగాలు

జిల్లాకు ఇప్పటికే మూడు కంపెనీల బలగాలు వచ్చినట్లు ఎస్పీ చెప్పారు. మూడు కంపెనీల బలగాలతో పాటు గ్రేహౌండ్స్, జిల్లా గార్డ్స్, సీఆర్పీఎఫ్, సింగరేణి, అటవీశాఖకు చెందిన సుమారు వెయ్యి నుంచి 1200 మందిని ప్రత్యేకంగా నియమించామన్నారు. సరిహద్దులో కాళేశ్వరం వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి నిఘా కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం, నగదు మొత్తం సుమారు రూ.70 లక్షల వరకు సీజ్ చేశామన్నారు. ముందస్తుగా మాజీ మావోయిస్టులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు వివరించారు.

సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

జిల్లా సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. మావోయిస్టులు తెలంగాణలోకి వచ్చి ఎన్నికలకు విఘాతం కలిగించే అవకాశం ఉండడంతో సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం చేశాం. పక్క రాష్ర్టాల పోలీసులతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. ఇటీవల ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ఎస్పీలతో ఐజీ స్థాయి అధికారి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారన్నారు. సరిహద్దుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. అవసరమైతే క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద , సరిహద్దు అటవీ ప్రాంతాల వద్ద డ్రోన్ ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

మహదేవపూర్ (కాటారం), మే 11 : పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంథని నియోజకవర్గంలో విధులు నిర్వర్తించనున్న పోలీసులు, సీఆర్‌పీఎస్, బీఎస్ఎఫ్, అటవీ, టీఎస్ఎస్‌పీ, శిక్షణ పోలీసులకు కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో, భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని సిబ్బందికి పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ అవగాహన కల్పించారు. ఈ నెల 13న ఉదయం 7 నుంచి 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటరు స్లిప్పులు, ఈసీ గుర్తించిన ఐడీ కార్డులున్న వారిని మాత్రమే అనుమతించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలని ఆదేశించారు. భూపాలిపల్లి, కాటారం డీఎస్పీలు సంతప్‌రావు, రామోహ్మన్‌రెడ్డి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- అభివృద్ధి పనులను రద్దు చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర
- సుధీర్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం

ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి.

భూపాలపల్లి రూరల్, మే 11 : తాను వందల కోట్ల నిధులతో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణరావు రద్దు చేశారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలు, వార్డుల్లో మట్టి రోడ్లు ఉండొద్దని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అండదండలతో నాడు పను లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం ఆయన భూపాలపల్లి పట్టణంలోని సీఆర్‌నగర్‌తో పాటు మండలంలోని గొర్లవేడు, నేరేడుపల్లి, శ్యామ్‌నగర్, మోరంచపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో పర్యటించారు. వరంగల్ బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి ప్రజలకు న్యాయం జరగాలన్నా, రాష్ట్రం చీకటిలోకి పోకుండా ఉండాలన్నా, అధికార పార్టీలను నిలదీయాలన్నా బీఆర్ఎస్ కారుగుర్తుకు ఓటు వేయాలన్నారు. రేపు వేయబోయే ఓటు భవిష్యత్ తరాలకు, దేశ, రాష్ట్ర అభివృద్ధికి నాంది పలుకుతుందన్నారు. తనపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే బెదిరేది లేదన్నారు. కక్ష సాధింపు రాజకీయం చేయకుండా సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని గండ్ర హితవు పలికారు. ప్రచారంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి : ఎస్పీ శబరీష్

ములుగు, మే11(నమస్తే తెలంగాణ) : నిష్పక్షపాతంగా ఎన్నికల విధులను నిర్వర్తించాలని ఎస్పీ శబరీష్ అన్నారు. ఎన్నికల బందోబస్తు విధులకు కేటాయించిన పోలీస్ అధికారులతో ఎస్పీ శనివారం ములుగులో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది నిర్దేశించిన సూచనల మేరకు పనిచేయాలని, ఉల్లంఘించిన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఆయుధాలు, అగ్గిపెట్టెలు, పెట్రోల్ వంటి వస్తువులు, వాహనాలకు అనుమతి లేదని, పార్టీ జెండాలు, గుర్తులు అనుమతించవద్దని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రవికుమార్, సీఐలు శ్రీధర్, రంజిత్‌కుమార్, రోహిత్, ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం : ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

వెంకటాపురం (నూగూరు) : ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు

మంగపేట : ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

టేకుమట్ల : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెంకటాపూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోవిందరావుపేట : ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ, నాయకులు

మహదేవపూర్‌లో ..

చివరి రోజు జోరుగా..

ఇంటింటికీ వెళ్లి.. ఉపాధి కూలీలను కలిసి..
బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని శ్రేణుల అభ్యర్థన

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. చివరి రోజు బీఆర్ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారంలో పాల్గొన్నాయి. ఇంటింటికీ వెళ్లడంతో పాటు ఉపాధి హామీ పని ప్రదేశాలకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కూలీలను కోరారు. బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్ కుమార్, మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవిత, పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రజలు సాదరంగా స్వాగతించి సానుకూలంగా స్పందించారు.

-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా మాయం

గణపురం, మే 11 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 147వ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా మాయమైంది. మరో 24 గంటల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఘటన వెలుగులోకి రావడంతో అధికారులు తర్జనభజన పడుతున్నారు. అయితే శనివారం నుంచి సోమవారం రాత్రి ఈవీఎంలు తరలించే వరకు సీసీ కెమెరాలు పనిచేయాలన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశంతో వీటిని మానిటరింగ్ చేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీ సిబ్బంది ఒక్కో కెమెరాను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో 147వ పోలింగ్ కేంద్రంలోని రూమ్‌లో తలుపు పక్కన రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఆన్‌లైన్‌లో కనిపించలేదు. దీంతో వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి తాళం తీసి చూడగా కెమెరా కనిపించలేదు. వేసిన తాళం వేసినట్లే ఉండి సీసీ కెమెరా మాయమవడం అధికారులకు అంతుపట్టలేదు. దీంతో ఈ ఘటనపై స్థానిక ఎస్సైకి వారు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు.

పోలింగ్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

ములుగురూరల్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రేపు నిర్వహించబోయే ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా సూచించారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లో తహసీలార్లతో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు నేడు పోలింగ్ సామగ్రి పంపిణీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కంటే ఒక రోజు ముందే కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులను చూసుకోవాలని తెలిపారు. ఎండాకాలం దృష్ట్యా తగిన సదుపాయాలను కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, ఆర్డీవో సిరాజ్‌ఉర్‌రెహమాన్, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

12రకాల గుర్తింపు కార్డులతో ఓటు వేయవచ్చు

ములుగురూరల్, మే11 : ఫొటో గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు) లేని ఓటర్లు 12రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులతో ఓటు వేయవచ్చునని కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. ఫొటో గుర్తింపు కార్డు లేని ఓటర్లు ఆధార్‌కార్డు, ఈజీఎస్ జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ పాస్ పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, కార్మిక శాఖ ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు, పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు కార్డు వంటి కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని తెలిపారు. తప్పనిసరిగా ఓటు వేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎన్నికల సిబ్బందికి గాయాలు

ములుగురూరల్, మే 11: రోడ్డు ప్రమాదంలో ఎన్నికల సిబ్బందికి గాయాలైన ఘటన మండలంలోని జంగాలపల్లి శివారు మేడి వాగు వద్ద శనివారం సాయంత్రం జరిగింది. కామారెడ్డి జిల్లాకు చెందిన బీట్ ఆఫీసర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, అంజయ్య, పద్మరావు, యాదగిరి, చైతన్యకుమార్, ఖమ్మం జిల్లాకు చెందిన నర్సింహారావు ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ములుగు జిల్లా కేంద్రానికి వచ్చారు. ఎస్పీ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. అనంతరం జంగాలపల్లిలో తమకు వసతి కల్పించిన ఎంఆర్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లేందుకు కొత్త ఆటోను కొనుగోలు చేసి వెళ్తున్న డ్రైవర్‌ను ఆపి ఎక్కారు. మేడివాగు వద్ద మలుపు వద్ద ఆటో అదుపు తప్పి పొలంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బీట్ ఆఫీసర్లు, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారికి ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని ఎంజీఎంకు వైద్యులు రెఫర్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ములుగు రూరల్, మే 11 :మండలంలోని బంజరుపల్లి గ్రామంలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వ్యవసాయ బావిలో ఉన్న మృతదేహాన్ని స్థానికుల సహాయంలో బయటకు తీశారు. సుమారు వారం రోజుల క్రితం బావిలో పడడంతో మృతదేహం గుర్తు పట్టకుండా కుళ్లిపోయింది. మృతుడు 40 నుంచి 45 మధ్య వయస్సు ఉంటాడని, ఒంటిపై తెల్లటి పూల చొక్కా, బనియన్, బ్లూ రంగు చెక్స్ డిజిన్ గీతల లుంగీ ధరించి ఉన్నాడు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రవికుమార్

మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కిన యువకుడు

సురక్షితంగా కిందికి దింపిన పోలీసులు

మంగపేట, మే 11 : మండలంలోని కమలాపురానికి చెందిన షామని రాజేశ్ శనివారం సాయంత్రం మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై రవికుమార్ సిబ్బందితో వచ్చి రాజేశ్‌ను టవర్ మీది నుంచి సురక్షితంగా కిందికి దించారు. అనంతరం ఆ యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గణపురం, మే 11: ఇంట్లో జరిగిన గొడవ కారణంగా మనస్తాపంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్కపల్లి గ్రామానికి చెందిన గాద సమ్మక్కకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు మహేశ్ (18) ఉన్నారు. గత నెల 17న ఆర్థిక సమస్యలతో ఇంట్లో జరిగిన గొడవతో మహేశ్ ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొంది ఈనెల 4న డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాడు. మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో ఈనెల 5న ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ తోటల్లో ఎరగడి మంటలు

మంగపేట, మే11 : మండలంలోని నర్సింహసాగర్ పంచాయతీ పరిధి గొందిగూడెం గ్రామ సమీపంలోని జామాయిల్ తోటల్లో శనివారం రాత్రి ఎరగడి మంటలు ఏర్పడ్డాయి. దీనికి తోడు బలమైన గాలులు వీయడంతో మంటలు నివాసాల పరిసరాలకు వ్యాపించాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే ఏటూరునాగారం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలు ఆర్పివేశారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఓటు హక్కును వినియోగించుకోనున్న 2,33,191 మంది ఓటర్లు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

ములుగు, మే11(నమస్తేతెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ములుగు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రేపు నిర్వహించే పోలింగ్‌కు ములుగు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే పోలింగ్‌లో జిల్లాలో 2,33,191మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. 87లొకేషన్లలో 258 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ములుగు నియోజకవర్గంలో 62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

సామగ్రి పంపిణీకి 30 సెక్టార్లు

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్: పోలింగ్ సామగ్రి పంపిణీకి 30 సెక్టార్లు ఏర్పాటు చేశామని భూపాలపల్లి ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, మీడియాతో మా ట్లాడుతూ సెక్టార్ అధికారులు, పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు 12న ఉదయం 7 గంటలకు పంపిణీ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ నంబర్, బస్సు నంబర్‌తో ట్రాకింగ్ చేయాలని, పోలింగ్ కేంద్రాల ప్రకారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది వివరాలు, హాజరు నమోదు పక్కగా చేయాలని సూచించారు. సామగ్రి పంపిణీ పర్యవేక్షణ నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షణ నోడల్ అధికారిగా మత్స్యశాఖ జిల్లా అధికారి అవినాష్‌ను నియమించామన్నారు. మెటిరియల్ తీసుకోవడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని, తదుపరి పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని భవేశ్ మిశ్రా సూచించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

ములుగు, మే11(నమస్తే తెలంగాణ) : ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల రోజున పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాల గురించి, బూత్ ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీలను గాలికి వదిలివేసిందన్నారు. రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపునకు దోహదం చేస్తాయన్నారు. ఈ సమావేశంలో ములుగు మండల కోఆర్డినేటర్ పాలెపు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, వేల్పూరి సత్యనారాయణ రావు, మేర్గు సంతోష్, గజ్జి నగేశ్, కోగిల మహేశ్, బైకాని ఓదెలు, జంపన్న, అంకూస్, నాజర్‌ఖాన్, ఆరెందుల కుమార్ పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించాలి

సింగరేణి సీఎండీ బలరాం

భూపాలపల్లి రూరల్, మే 11: కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి సమష్టిగా కృషి చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ బలరాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయంలో భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని గనుల మేనేజర్లు, ఏజెంట్లతో భూగర్భ గనుల ఉత్పత్తిపై సీఎండీ బలరాం సమీక్ష సమావేశం నిర్వహించారు. గనుల ప్లాన్‌లను వీక్షించారు. అనంతరం భూపాలపల్లి ఏరియాలో పర్యటించారు. కేటీకే ఓసీ-2 ఉపరితల గనిని సందర్శించారు. గని వ్యూ పాయింట్ వద్ద యంత్రాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట భూపాలపల్లి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్, ఎస్ఓటూ జీఎం కవీంద్ర, కేటీకే ఓసీ-2 ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

మంజూర్‌నగర్‌లో రోడ్డు ప్రమాదం

ఇద్దరి మృతి, నలుగురికి గాయాలు

భూపాలపల్లి రూరల్, మే 11: భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరికి తీవ్రగాయాలు, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని జిల్లా కేంద్రంలోని వంద పడకల దవాఖానకు తరలించారు. సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి ఓసీ-3 ఎస్‌వీఈసీ కంపెనీలో డ్రైవర్లుగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయనగరం జిల్లా లక్ష్మీపురానికి చెందిన గవర ముసలి నాయుడు (25), అప్పల నాయుడు, మహబూబ్‌నగర్ జిల్లా నిజాంపూర్ గ్రామానికి చెందిన వాకిటి సత్యనారాయణ ఓ టు వేసేందుకు వారి గ్రామాలకు వెళ్లడానికి బస్సు కోసం వేచి చూస్తున్నారు. అకస్మాత్తుగా టిప్పర్ దూసుకురావడంతో గవర ముసలి నాయుడు, సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. భూపాలపల్లి ఓసీ-3 ఎస్‌వీఈసీ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రత్యక్ష సాక్షి కోట మురళి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తునికాకు టెండర్లు పూర్తి

త్వరలో ప్రారంభం కానున్న సేకరణ

మహదేవపూర్, మే 11 : మండలంలోని ఎల్‌కేశ్వరం, సూరారం యూనిట్లకు తునికాకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మండల అటవీశాఖ అధికారి కమల శనివారం తెలిపారు. సూరారం యూనిట్ పరిధిలో రెండు వేలు, ఎల్‌కేశ్వరం పరిధిలో 800 స్టాండర్డ్ బ్యాగ్‌లు లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆమె వెల్లడించారు. గతంలో 50 తునికాకులతో కూడిన ఒక్కో కట్టకు రూ. 2.50 ధర చెల్లించగా ప్రస్తుతం దానిని రూ. 3కు పెంచినట్లు వివరించారు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను ఆయా యూనిట్ల పరిధిలోని బీట్ అధికారికి అందజేసి ఉచితంగా లేబర్ వేజ్ కార్డు పొందాలన్నారు. తునికాకు కట్టలను కల్లాలకు చేరవేసిన వారం రోజులల్లోనే ఆన్‌లైన్‌లో డబ్బులు జమచేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కమల సూచించారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మల్హర్, మే 11: జిల్లాలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడనుందన్న వాతావరణ శాఖ సూచన నేపథ్యంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, రైతులకు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మల్హర్ మండలంలోని పెద్దతూండ్ల, వెల్మాలపల్లి, అద్వాలపల్లి, ఇప్పలపల్లి, కొయ్యూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జాప్యం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, BHAGYANAGARAM SHIRISHA (New Name), previously called as BHAGYANAGAR SIRISHA alias B. SIRISHA, D/o. BHAGYANAGARAM DEVADAS, W/o. KANUKUNTLA RAJ KUMAR, R/o. H.No. 22-5-213/24/66, Siris Green City, Deshaipet, Dist. Warangal-506006, T.S., India. and solemnly declare.
NTW-14414

CHANGE OF NAME
★I, Shamili Kasoju, W/o Naresh Kasoju, aged 35 years, Residing at HNo 27-14-21, Hasanparthy, Hanumakonda, Telangana, changed my name from Shamili Maroju to Shamili Kasoju vide affidavit dated 10.03.2023, sworn before notary Ch. Aga Reddy.
NT-01029

REAL ESTATE

★మీ ఇంటి ఖాళీ స్థలాలను, వ్యవసాయ భూములను మాకు డెవలప్‌మెంట్‌కు ఇచ్చి మీరు ఆశించినంత పొందండి. వెంటనే సంప్ర:
Cell: 9394326111, 7981174745
NTW-314601

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTek
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

HEALTH CARE
★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును.
సంప్ర|| 6281476205, 9440325526
KMM_11654

శ్రీకృష్ణ ఆయుర్వేదిక్ క్లినిక్ & మెడికల్ స్టోర్స్

★ కన్సల్టేషన్ సమయం: ప్రతి రోజు సా|| 5 గం.ల నుండి 8.30 ని.ల వరకు మరియు ప్రతి ఆదివారం ఉ|| 10 గం.ల నుండి రా|| 8.30 ని.ల వరకు.
Dr. A. APARANJI MD (Ayu),
Cell: 8106820311, 9676729606
NTW-323305

PERSONAL ANOUNCEMENT
★This is a Public Notice to declare that I, Naresh Kasoju, S/o Chandrakantham Kasoju, aged 40 years, residing at H.No 27-14-21, Hasanparthy, Hanumakonda, Telangana, am known as 'Naresh K'. and 'Naresh Kasoju' and kited signature in 'abstract' mode and 'cursive writing' mode in various documents, and both belong to one and the same person, vide affidavit dated 10.03.2023, sworn before notary Ch. Aga Reddy. Hereafter I will be known as 'Naresh Kasoju' and kite my signature in 'cursive writing' mode for all future purposes.
NT-01028

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565